సాక్షి జనగామ

ఆదివారం ׀ 22 ׀ జూన్ ׀ 2025



ఇందిరమ్మ ప్రభుత్వాన్ని దీవించండి

పేదల కష్టాలను తీర్చే ఇందిరమ్మ ప్రభుత్వాన్ని రాబోయే రోజుల్లో ప్రజలు దీవించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

- 8లో▸



డిసెంబర్ నాటికి రైల్వేకోచ్ ఫ్యాక్టరీ

కాజీపేట మండలం అయోధ్యపురం శివారులో నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ డిసెంబర్ నాటికి పూర్తవుతుందని రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

36^0 /26^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



స్టేషన్‌ఘన్‌పూర్: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పాటుపడాలని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పదో తరగతి, ఇంటర్మీడియట్ కీలకదశ అని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనల మేరకు ప్రణాళికయుతంగా చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తుపదార్థాలు, గంజాయి, డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. ఆన్‌లైన్ గేమ్‌ల జోలికి వెళ్లొద్దని, మొబైల్‌ఫోన్‌లో అనవసరపు లింక్‌లను ఓపెన్ చేయవద్దని తెలిపారు. నిత్యం యోగా చేయడం అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ జి.వేణు, ఎస్‌ఐ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికే పదవులు



జనగామ: పార్టీ కోసం కష్టపడే ప్రతిఒక్కరికీ పదవులు వరిస్తాయని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన జనగామ పట్టణం, రూరల్, బచ్చన్నపేట మండల ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా పరిశీలకుడు లింగం యాదవ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని జిల్లా ఎన్నికల పరిశీలకుడు లింగం యాదవ్ అన్నారు. పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు మెరుగు బాలరాజు గౌడ్, జనగామ, బచ్చన్నపేట మండలాల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, బాల్‌రెడ్డి, నిమ్మతి మహేందర్‌రెడ్డి, వంగాల మల్లారెడ్డి, మేడ శ్రీనివాస్, ఆలేటి సిద్ధిరాములు, కరుణాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రూ.50 వేల ఆర్థికసాయం

జనగామ పట్టణంలోని సక్కలగుడిసెలో నివాసముంటున్న జయమ్మ కుటుంబానికి శనివారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇందిరమ్మ ఇంటి పట్టాతో పాటు రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. అంగ వైకల్యంతో బాధపడుతున్న ఆమెకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ సమయంలో డబ్బులు త్వరగా వచ్చేలా చూస్తామన్నారు.

రేపు ఒలింపిక్ రన్

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో ఈనెల 23న ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు నెహ్రూ పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు ఈ రన్ ఉంటుందని, యువత, క్రీడాకారులు, క్రీడా అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు పాల్గొనాలని కోరారు.

అడవుల్ని చుట్టొద్దాం..

సండే స్పెషల్

తాడ్వాయి, ఏటూరునాగారం అభయారణ్యంలో త్వరలో 'జంగిల్ సఫారీ'

అడవుల్లో 17కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం



మేడారం-తాడ్వాయి మధ్యలో ఇటీవల కనిపించిన అడవి దున్న (ఫైల్)

జంగిల్ సఫారీ కోసం అడవిలో వేసిన రోడ్డు





ఏటూరునాగారం అభయారణ్యంలోని కొండేటివాగు

బోన్ల నడుమ జంతువుల్ని.. డెన్ మధ్యన పులిని.. గూళ్లలో పిచ్చుకల్ని.. నిలువ నీటి తొట్లలో తాంబేళ్లను.. ఆక్వేరియంలో చేపల్ని జూ పార్క్‌లో చూసి మురిసిపోతాం. అలాంటిది.. దట్టమైన అడవిలో పచ్చందాల నడుమ సఫారీలో ప్రయాణిస్తూ.. వేటాడే పులిని.. చెవులకింపైన పక్షుల కిలకిలారావాల్ని.. చెంగుచెంగున పరుగెట్టే లేడికూనల్ని చూస్తూ సెల్‌ఫోన్లలో బంధిస్తూ పర్యాటకులు మైమరచిపోయేలా.. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటకానికి మరింత శోభ తెచ్చేలా ఎస్‌ఎస్ తాడ్వాయి వైల్డ్‌లైఫ్ అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. తాడ్వాయి, ఏటూరునాగారం అభయారణ్యంలో హాయిగా విహరించేందుకు సాగుతున్న 'జంగిల్ సఫారీ' ఏర్పాట్లపై ఈవారం 'సాక్షి' ప్రత్యేకం. -ఎస్‌ఎస్‌తాడ్వాయి

- ఏర్పాట్లు చేస్తున్న అటవీశాఖ అధికారులు
- ఉమ్మడి జిల్లా పర్యాటకానికి మరింత శోభ

ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, తాడ్వాయి అభయారణ్యాన్ని పర్యాటకులు చుట్టి వచ్చేందుకు అటవీశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్‌ఎస్ తాడ్వాయి వైల్డ్ లైఫ్ శాఖ ఆధ్వర్యంలో జంగిల్ సఫారీకి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. పర్యాటకులు సఫారీలో అడవులను వీక్షించేందుకు సైతం రోడ్ల నిర్మాణ పనులు చేస్తున్నారు. త్వరలోనే జంగిల్ సఫారీ పర్యాటకులకు అందుబాటులోకి రానుంది.

17 కిలోమీటర్లు దారి..

అడవులను జంగిల్ సఫారీ ద్వారా సందర్శించేందుకు ఎస్‌ఎస్‌తాడ్వాయి హట్స్ సమీపం నుంచి కాటాపూర్ బీటీ రోడ్డు నుంచి అడవిలో 17 కిలోమీటర్ల వరకు దారి ఏర్పాటు చేశారు. దారి మధ్యలో సిమెంట్ కాజ్‌వేలు కూడా నిర్మించారు. అడవిలో పెద్దగుట్ట వరకు దారి ఏర్పాటు చేశారు. ఈదారి మార్గాన జంగిల్ సఫారీలో పర్యాటకులు పెద్దగుట్ట చుట్టి వచ్చేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.

ప్రకృతిని ఆస్వాదించేలా..

హైదరాబాద్ పట్టణ ప్రాంతాల నుంచి బొగత, లక్నవరం, రామప్ప పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చే పర్యాటకులు దట్టమైన అడవుల్లోని ప్రకృతికి ఫిదా అవుతారు. గతంలో ఎస్‌ఎస్ తాడ్వాయి హట్స్‌లో బస చేసిన పర్యాటకులు ట్రెక్కింగ్, జంగిల్ సఫారీ ద్వారా అడవులను చుట్టుముట్టి వచ్చేవారు. సుమారు ఐదేళ్ల క్రితం జంగిల్ సఫారీ మూలనపడింది. దీంతో అప్పటినుంచి పర్యాటకులు ఎస్‌ఎస్ తాడ్వాయిలోని అడవుల సందర్శన నిలిచిపోయింది.

పెరుగుతున్న పర్యాటకుల తాకిడి

రోజురోజుకూ పలు ప్రాంతాల నుంచి పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు పర్యాటకుల తాకిడి పెరుగుతుండడంతో అటవీశాఖ అధికారులు మళ్లీ జంగిల్ సఫారీని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అడవి మార్గాల్లో రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు. రోడ్ల నిర్మాణ పనులు కూడా పూర్తి దశకు చేరుకున్నాయి. త్వరలోనే జంగిల్ సఫారీ వాహనాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. తాడ్వాయి మండల పరిధిలోని దామెరవాయి అటవీ ప్రాంతంలోని ఆదిమానవుల సమాధులను పర్యాటకులు, యూనివర్సిటీ విద్యార్థులు సందర్శిస్తున్నారు. అడవుల సందర్శనతో పాటు సమాధులను వీక్షించేందుకు జంగిల్ సఫారీ వాహనం ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు, పర్యాటకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తాడ్వాయి నుంచి మేడారం మీదుగా ఊరట్టం ఏటూరునాగారం మండలంలోని కొండాయి వెళ్లే దారిలో మూడు కిలోమీటర్ల దూరంలో కొండేటి వాగు వ్యూ పాయింట్ చాలా అద్భుతంగా ఉంది. ఈ పాయింట్ వరకు జంగిల్ సఫారీ ఏర్పాటు చేస్తే మేడారానికి వచ్చే భక్తులతో పర్యాటకుల సంఖ్య పెరగనుంది.

రెండు నెలల్లో అందుబాటులోకి..



ఎస్‌ఎస్‌తాడ్వాయిలోని జంగిల్ సఫారీ 60 రోజుల్లో పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తాం. తాడ్వాయి హట్స్ నుంచి 17 కిలోమీటర్లు పెద్దగుట్ట వరకు రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఇంకా అన్ని హంగులతో అడవులను సందర్శించేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.

- రమేశ్, ఎఫ్‌డీఓ, ఏటూరునాగారం

సెటిల్‌మెంట్‌పై ఇంటెలిజెన్స్ ఆరా!

- కలెక్టర్ ఫోన్..సీడీఎంఏ సీరియస్?
- ఇంటి అనుమతుల లెక్కలు తీస్తున్న నిఘా విభాగం
- ఎంక్రోచ్‌మెంట్లు, పర్మిషన్ లేని నిర్మాణాలపై కన్ను
- నెలనెలా వసూళ్లు చేసే వారి గురించి వాకబు



జనగామ మున్సిపాలిటీ

సాక్షి ఎఫెక్ట్

జనగామ: జనగామ పురపాలిక సెటిల్‌మెంట్లపై ఇంటెలిజెన్స్ వర్గాలు కూపీ లాగుతున్నాయి. ఇంటి అనుమతుల సమయంలో మధ్యవర్తిత్వం, చేతివాటంకు సంబంధించి పెత్తనం ఎవరిదనే దానిపై ఆరా తీస్తున్నారు. 'సెటిల్‌మెంట్ కింగ్‌లు ఎవరు?' శీర్షికన ఈ నెల 21న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం సంచలనం కలిగించింది. పట్టణంలో ఎక్కడా చూసినా ఈ కథనంపైనే మాట్లాడుకోవడం కనిపించింది. చేతివాటం ప్రదర్శించే కింగ్‌లు మాత్రం గప్‌చుప్ అయిపోయారు.

కూపీ లాగుతున్నారు..

మెమో, షోకాజ్‌లతో పాటు గాడితప్పిన పురపాలికలో ఏం జరుగుతుందనే విషయమై ఇంటెలిజెన్స్ వర్గాలు కూపీ లాగుతున్నారు. సెటిల్‌మెంట్ కథనంపై కలెక్టర్ రిజ్వాన్ బాషా ఏసీకి ఫోన్ చేసి వాకబు చేయగా.. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, కమిషనర్ వెంకటేశ్వర్లను తన చాంబర్‌కు పిలుపించుకున్నట్లు తెలిసింది. దీనిపై సీడీఎంఏ అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం ఉండగా... గతేడాది నుంచి జారీ చేసిన ఇంటి అనుమతుల వివరాలు, ముందస్తు గుర్తించిన ఎంక్రోచ్‌మెంట్ల సమాచారం పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని ఆదేశించినట్లు సమాచారం. పట్టణ ప్రణాళిక, రెవెన్యూ సెక్షన్ తదితర విభాగాలు గత కొంత కాలంగా అనేక వివాదాలకు నెలవుగా మారింది. ఇందులో కొంత మంది తప్పులు చేసి అడ్డంగా బుక్కైనా.. నామమాత్రపు చర్యలు తప్ప, సీరియస్ యాక్షన్ ఉండదనే విషయాన్ని పట్టణ ప్రజలు బాహాటంగానే మాట్లాడుకుంటున్నారు.

కలిసొస్తుంది ఎవరికీ?

ఫుట్‌పాత్ వ్యాపారం, నాలాలపై చిరు వ్యాపారాలు, నూతన నిర్మాణ సమయంలో సడలింపు, అనుమతులు లేకుండా భవన నిర్మాణ పనులు ప్రారంభించడం కొంత మందికి కలిసి వస్తుందనే ఆరోపణలు నిత్యం వింటూనే ఉంటున్నాం. దిగువ స్థాయి సిబ్బంది సైతం వార్డులు తిరుగుతూ, నిర్మాణాల్లో చిన్న చిన్న తప్పిదాలను గుర్తించి అందిన కాడికి దోచేస్తున్నారనే ప్రచారం ఉంది. స్థానికంగా కమిషనర్.. పైన అదనపు కలెక్టర్... ఆ పైన కలెక్టర్ పర్యవేక్షణ ఉన్నా... జనగామ మున్సిపల్ వ్యవహారం మొత్తం అందులో పని చేస్తున్న కొంత మంది చేతుల్లో మాత్రమే ఉందని మెజార్టీ పట్టణ ప్రజల అభిప్రాయం. ఎవరిపై ఎన్ని ఆరోపణలు వచ్చినా మెమో, షోకాజ్‌లతో సరిపెట్టడం తప్ప, చర్యలు లేకపోవడంతోనే చేతివాటం మూడు పువ్వులు, ఆరు కట్టలుగా వర్ధిల్లుతోందని మేధావివర్గం అంటోంది. మున్సిపల్ వ్యవహారం ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకు వచ్చే విధంగా ఉండడంతో, ఇంటెలిజెన్స్ వర్గాల నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయనే సమాచారం తెలియ వచ్చింది. పనిలో పనిగా ఏసీబీ వర్గాలు సైతం లంచాల భాగోతంలో ముందు వరుసలో ఉన్న వారి వివరాలను సేకరించే పనిలో ఉన్నట్లు సమాచారం.

ఉద్రిక్తత.. ఉత్కంఠ



ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని వైద్యపరీక్షల నిమిత్తం సుబేదారి పోలీస్‌స్టేషన్ నుంచి ఎంజీఎంకు తరలిస్తున్న పోలీసులు



సుబేదారి పీఎస్ వద్ద ఆందోళనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఉదయం నుంచి రాత్రివరకు సాగిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఎపిసోడ్

- శంషాబాద్‌లో అరెస్ట్ చేసి హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు..
- బీఆర్‌ఎస్, విద్యార్థి నేతల ఆందోళన.. సీఎం దిష్టిబొమ్మ దహనం..
- బెయిల్ రావడంతో కార్యకర్తల ఆనందోత్సాహం

హనుమకొండలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉద్రిక్తత, ఉత్కంఠ వాతావరణం నెలకొంది. గ్రానైట్ వ్యాపారిని బెదిరించిన కేసులో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని హనుమకొండ సుబేదారి పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి తర్వాత శంషాబాద్ ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేసి నేరుగా వరంగల్‌కు తీసుకువచ్చారు. మాజీ ప్రజాప్రతినిధులు, విద్యార్థి నాయకుల ఆందోళన, పరామర్శలతో సుబేదారి పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. రాత్రి ఆయనకు బెయిల్‌రావడంతో కార్యకర్తలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.

- వరంగల్ క్రైం

- వివరాలు 8లో▸

జీపీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు రాజు



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు రాపర్తి రాజు

పాలకుర్తి: గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జీపీ యూనియన్ రాష్ట్ర నాయకుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు అన్నారు. శనివారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో కుక్కల సోమన్న అధ్యక్షతన పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న జీపీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీరాజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, ఈ ధర్నాలో జీపీ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న, జీపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న, నాయకులు పరంజ్యోతి, యాకన్న, కిష్టయ్య, యాదగిరి, రాజు, ఇరుగు నరసింహా, సుశీల, అరుణ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలను నిలదీస్తే కేసులు బనాయిస్తున్నారు..

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ: అక్రమాలను నిలదీయడంతోనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని శంషాబాద్ విమానాశ్రయంలో అక్రమంగా అరెస్ట్ చేశారని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, కాంగ్రెస్ నేతల దుర్మార్గాలను అడుగడుగునా ప్రశ్నిస్తున్నందుకే బీఆర్‌ఎస్ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, కాంగ్రెస్ నియంతృత్వానికి తలొగ్గే ప్రసక్తే లేదన్నారు. కౌశిక్‌రెడ్డి అరెస్ట్‌ను ఖండిస్తున్నట్లు చెప్పారు.

జయశంకర్ సేవలు మరువలేనివి

జనగామ రూరల్: తెలంగాణ సమాజానికి ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు మరువలేనివని జిల్లా విశ్వకర్మ కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు దీగోజు నరసింహచారి అన్నారు. శనివారం జయశంకర్ 14వ వర్ధంతి పురస్కరించుకొని పట్టణంలో దీగోజు సాంబచారి ఆధ్వర్యంలో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బత్తోజు సిద్ధిరాములు, సాతెల్లి రాజమౌళి, చెల్లోజు నవీన్, బండ్ల మల్లేశం పాల్గొన్నారు.

జనారణ్యంలోకి జింక



పరుగెత్తుతున్న జింక

తరిగొప్పుల: మండలకేంద్రం సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం ఉదయం అనూహ్యంగా మచ్చల జింక పరుగెత్తుతూ వచ్చి చేరింది. అడవిలో ఉండాల్సిన జింక జనంలోకి రావడంతో పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు. జనాన్ని చూసిన జింక జగ్గయ్యపేట వైపు పరుగెత్తుతూ వెళ్లిందని బీసీకాలనీ వాసులు తెలిపారు.



యోగా చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీసీపీ రాజమహేంద్రనాయక్, ఉన్నతాధికారులు, యువకులు

యోగాసనాలు చేస్తున్న మాజీ కౌన్సిలర్ వాంకుడోతు అనిత, యోగా మాస్టర్లు

యోగాతో ఆరోగ్యం

- కలెక్టర్ రిజ్వాన్ బాషా
- జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

జనగామ: మనిషి నిత్యందన జీవితంలో సంపూర్ణ ఆరోగ్యానికి ప్రధాన సూత్రం యోగా అని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ధర్మకంచ స్టేడియంలో శనివారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ చేతన్ నితిన్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. యోగా దినోత్సవం పురస్కరించుకుని అన్ని శాఖల అధికారులతో పాటు ఉద్యోగులు, సిబ్బంది, యువతీయువకులు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. యోగా మాస్టర్ల పర్యవేక్షణలో కలెక్టర్, డీసీపీ, ఏసీ, ఏఎస్పీ, ప్రజలు యోగాసనాలు వేశారు. మూడు గంటల పాటు జరిగిన యోగాలో మనస్సును ప్రశాంతత చేసుకుని నిమగ్నమయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాను అలవాటు చేసుకుని క్రమం తప్పకుండా చేయాలన్నారు. కాగా మండల కేంద్రాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, తదితరుల ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

- మరిన్ని ఫొటోలు 9లో▸

24న డీసీసీబీ మహాజన సభ

హన్మకొండ : వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మహాజన సభ ఈనెల 24న నిర్వహించనున్నట్లు ఆ బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహ్మద్ వజీర్ సుల్తాన్ తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు మహాజన సభ జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

అడ్మిషన్స్ క్లోజ్

- ప్రభుత్వ పాఠశాల ఎదుట ఖాళీలు లేవని బోర్డు



నో అడ్మిషన్ బోర్డు పెడుతున్న హెచ్ఎం

రఘునాథపల్లి : సాధారణంగా ఇలాంటి బోర్డులను ప్రైవేట్ పాఠశాలల ఎదుట చూస్తుంటాం. కానీ జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ పెద్దమ్మగుడి సమీపంలోని ప్రాథమిక పాఠశాల (ఇంగ్లిష్ మీడియం) ఎదుట శనివారం హెచ్ఎం ఆలేటి యాదవరెడ్డి ఆధ్వర్యంలో మా పాఠశాలలో సీట్లు ఖాళీ లేవు (అడ్మిషన్స్ క్లోజ్) అని బోర్డు ఏర్పాటు చేశారు. పాఠశాలలో గతేడాది 44 మంది విద్యార్థులు ఉండే వారు. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభంలో హెచ్ఎం యాదవరెడ్డి, ఉపాధ్యాయులు రజిత, రేణుక బడిబాటలో భాగంగా పాఠశాలలో అందిస్తున్న విద్య, తదితర సౌకర్యాలపై తల్లిదండ్రులకు అర్థమయ్యే రీతిలో ప్రచారం చేయడంతో 115 మంది కొత్తగా అడ్మిషన్లు పొందారు. ప్రస్తుతం 159 మంది విద్యార్థులు ఉన్నారు. కొత్తగా చేరేందుకు విద్యార్థులు వస్తున్నప్పటికీ తరగతి గదుల కొరత ఉందని తెలిపారు. అంతే కాకుండా ప్రస్తుతం చేరిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేశామని హెచ్ఎం పేర్కొన్నారు.

కారు ఢీకొని రైతు మృతి

- మోపెడ్ దగ్ధం



ఆంగోత్ దస్రు (ఫైల్)

గీసుకొండ : మోపెడ్‌పై పొలం వద్దకు వెళ్తున్న రైతును కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. గీసుకొండ మండలం దస్రు తండాకు చెందిన రైతు ఆంగోత్ దస్రు (60) శనివారం మధ్యాహ్నం తన మోపెడ్ (వాహనం)పై వెళ్తున్నాడు. వరంగల్–నర్సంపేట రహదారిపై మూలమలుపు తిరిగే క్రమంలో వెనక నుంచి (వరంగల్ వైపు) అతివేగంగా వచ్చిన కారు దస్రు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అతడు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అదే వేగంతో కారు మోపెడ్‌ను ముందుకు తోసుకుంటూ వంద మీటర్ల దూరం వరకు వెళ్లగా మంటలు చెలరేగి మోపెడ్ దగ్ధమైంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలాన్ని గీసుకొండ ఎస్సైలు కుమార్, ప్రశాంత్ సందర్శించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుమార్ తెలిపారు.

వినయ్‌భాస్కర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు



పోలీస్ స్టేషన్ వద్ద ఎర్రబెల్లి దయాకర్‌రావు, కౌశిక్‌రెడ్డి భార్య





సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి నేతలు



ఉద్రిక్తత..ఉత్కంఠ

- ఉదయం నుంచి రాత్రివరకు సాగిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఎపిసోడ్
- శంషాబాద్‌లో అరెస్టు చేసి హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు..
- బీఆర్ఎస్ నేతల ఆందోళన.. రోడ్డుపై బైఠాయింపు
- సీఎం దిష్టిబొమ్మ దహనం.. విద్యార్థి నేతల అరెస్టు

వరంగల్ క్రైం/కాజీపేట రూరల్: హనుమకొండలో శనివారం ఉదయం నుంచి రాత్రివరకు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. గ్రానైట్ వ్యాపారిని బెదిరించిన కేసులో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని హనుమకొండ సుబేదారి పోలీసులు శంషాబాద్ ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేసి నేరుగా వరంగల్‌కు తీసుకు వచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో సుబేదారి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేశారు. అక్రమ అరెస్టులను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులను నిలువరించేందుకు పోలీసులు రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లను అడ్డు పెట్టి మోహరించారు.

కేసు నమోదు ఇలా..

కమలాపురం మండలంలోని గుండేడు గ్రామానికి చెందిన గ్రానైట్ వ్యాపారి కట్ట మనోజ్‌రెడ్డిని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఫోన్‌లో బెదిరించి రూ.50లక్షలు డిమాండ్ చేసినట్లు, తన భర్తకు ప్రాణహాయం ఉన్నట్లు గత ఏప్రిల్ 21న కట్ట ఉమాదేవి సుబేదారి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేయగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా ముందస్తు అరెస్టులు చేయవద్దని కోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ క్రమంలో హైకోర్టు ఆ ఉత్తర్వులను ఇటీవల రద్దు చేయడంతో పోలీసులు పథకం ప్రకారం శుక్రవారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అరెస్టు చేసి సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు.



బెయిల్ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్, ఎర్రబెల్లి దయాకర్ రావు

రోడ్డుపై బీఆర్ఎస్ నాయకుల బైఠాయింపు..

పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, శంకర్ నాయక్, నేతలు రాకేష్ రెడ్డి, సత్యనారాయణరావు పలువురు సుబేదారి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. కౌశిక్ రెడ్డిని కలవకుండా అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. అనంతరం నేతలు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను కలిసి పరిస్థితిని వివరించారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం..

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేయిస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు, విద్యార్థి నేతలు సుబేదారి పోలీస్ స్టేషన్ సమీపంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం విద్యార్థి సంఘం నేతలు బొల్లికొండ వీరేందర్, రామ్మూర్తి, శరత్, రాజేష్ నాయక్, మహమూద్ చోటు, సదంత్, శ్రవణ్ కుమార్, సాయి కుమార్, రాజేష్, రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి కాజీపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కాజీపేట జంక్షన్‌లో 144 సెక్షన్ విధింపు

కాజీపేట రైల్వే కోర్టుకు కౌశిక్‌రెడ్డిని తరలించే నేపథ్యంలో పోలీసులు రైల్వే కోర్టు బయట చుట్టూ పక్కల ఎవరు రాకుండా 144 సెక్షన్ విధించారు. కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ సుధాకర్‌రెడ్డి, పోలీసులు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను, మీడియాను కోర్టు ప్రాంగణంలోకి రాకుండా కట్టడి చేశారు. మధ్యాహ్నం 3:10 గంటలకు కౌశిక్‌రెడ్డిని పోలీసులు రైల్వే కోర్టుకు తరలించారు. విషయం తెలిసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ కోర్టుకు వచ్చారు. అనంతరం రాత్రి 8 గంటల తర్వాత రిమాండ్‌ను కొట్టివేసి బెయిల్ మంజూరు కావడంతో ఆనందంగా వ్యక్తం చేశారు

కౌశిక్‌రెడ్డికి ఎంజీఎంలో వైద్యపరీక్షలు



కౌశిక్ రెడ్డికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఎంజీఎం : గ్రానైట్ వ్యాపారిని బెదిరించిన కేసులో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు శనివారం వైద్యపరీక్షల నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకు వచ్చారు. మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, సుబేదారి పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు మధ్య ఎమ్మెల్యేకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజీఎం అత్యవసర విభాగానికి బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరుకుని సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డిని నేరుగా కోర్టుకు తరలించారు.

రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అరెస్ట్.. బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి

హన్మకొండ: రాజకీయ కక్షసాధింపులో భాగంగానే హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అరెస్టు చేశారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ఎప్పటికప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నందుకే ఈ అరెస్ట్ అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చేదాక ఈ ప్రభుత్వాన్ని వెంటాడుతూనే ఉంటామన్నారు.

ప్రజా వ్యతిరేకతపై స్పందిస్తున్నాడని..

సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై స్పందిస్తున్న వ్యక్తి కౌశిక్‌రెడ్డి అని, అతనిపై ఏదో కేసు పెట్టాలని చూస్తుంది. ఎట్టి పరిస్థితిల్లో అయినా కౌశిక్ రెడ్డిని జైల్లో పెట్టాలని ఆరోపిస్తూ కేసు పెట్టడం జరిగింది. జడ్జీ వద్ద న్యాయవాదులు వాదించడం వల్ల మేజిస్ట్రేట్ లోతుగా పరిశీలించి బెయిల్ ఇచ్చారు.

– బి.వినోద్‌కుమార్, మాజీ ఎంపీ

కౌశిక్‌రెడ్డి అరెస్టు కుట్రపూరితం..

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి కుట్రపూరితంగా బీఆర్ఎస్ నేతలను అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారు. ప్రజల తరఫున పోరాడుతున్న కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులను కేసుల పేరుతో వేధిస్తోంది. కాంగ్రెస్ పార్టీ కుట్రలను ప్రజా క్షేత్రంలో ఎండగడుతాం.

– వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు

సీఎం వైఖరిని ఖండిస్తున్నా..

ముఖ్యమంత్రి, మంత్రుల అక్రమాలను, అవినీతిని కేటీఆర్, హరీష్‌రావు, కౌశిక్‌రెడ్డిలు ప్రశిస్తుంటే వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పాలన వల్ల రాష్ట్రం దివాలా తీసింది.

– ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ మంత్రి

కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ రంగారావు కన్నుమూత

- వచన కవిత్వంలో అగ్రగణ్యుడు మాదిరాజు రంగారావు



రంగారావు (ఫైల్)

కేయూ క్యాంపస్ : ఖమ్మం జిల్లాకు చెందిన కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ మాదిరాజు రంగారావు (90) అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లో శనివారం కన్నుమూశారు. ఆయన భార్య కొంతకాలం క్రితం మరణించగా ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తెలుగు సాహిత్యంలో పండితుడు, శాస్త్రీయ సాహిత్యం, భారతీయ, ఆధునిక కవిత్వం, నవల విమర్శ,సంస్కృత సాహిత్య అధ్యయనాలతో సంబంధం కలిగి ఉన్నారు. పదవి విరమణ తర్వాత కూడా వచన కవిత్వంలో 2024 వరకు ప్రతి ఏడాది ఒక పుస్తకం రచించారు కూడా. మాదిరాజు రంగారావు ఆధునిక తెలుగు సాహిత్యంలో అగ్రశ్రేణి సాహిత్య రచయితలలో ఒకరు. కేయూ తెలుగు విభాగంలో 1968 నుంచి 1995వరకు, ఉస్మానియా యూనివర్సిటీలో 1964 నుంచి 1968 వరకు తెలుగు సాహిత్యాన్ని బోధించారు. స్వేచ్ఛ కవిత్వంపై 46 పుస్తకాలు, పరిశోధన, సాహిత్య విమర్శలపై 14 పుస్తకాలు రచించారు. సుమారు 30 ఏళ్ల పాటు తెలుగు విభాగంలో ఆచార్యుడిగా పనిచేశారు. రంగారావు ఎప్పుడు తెల్లటి దుస్తుల్లో ఉన్నట్లే ఆయన కవితా సంపుటాలు కూడా తెల్లపురంగు కవర్ పేజీలపై ఎరుపు రంగు శీర్షికలతో ఉండేవి. మాదిరాజు రంగారావు మరణంపై సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహరబాబు, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్‌వీఎన్ చారి, కాళోజీ ఫౌండేషన్ మిత్ర మండలి సభ్యులు, ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి, కార్యదర్శి వీఆర్ విద్యార్థి సంతాపం ప్రకటించారు.

ప్రణాళికతో చదివితే ‘సివిల్స్’ సాధ్యం

- ఆర్క్ రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ వివేకానంద



సదస్సులో మాట్లాడుతున్న డైరెక్టర్ వివేకానంద

విద్యారణ్యపురి : ప్రణాళికతో చదివితే సివిల్స్ పరీక్షల్లో విజయం సాధ్యమని హైదరాబాద్‌లోని ఆర్క్ రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్, (యూపీఎస్సీ ర్యాంకర్–2014) డాక్టర్ జి.వివేకానంద సూచించారు. శనివారం హనుమకొండలోని హరిత కాకతీయలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు సివిల్స్ ఎలా క్లియర్ చేయాలి అనే అంశంపై నిర్వహించిన ఉచిత అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సివిల్ సర్వీస్ పరీక్ష సిద్ధం, లక్ష్య నిర్ధారణ, విజయానికి అవసరమైన మానసిక సంసిద్ధత వంటి అంశాలను వివరించారు. సివిల్ సర్వీసెస్ క్లియర్ చేయాలంటే రోజుకు 15 గంటలు చదవాల్సిన అవసరం లేదని, ఆరు నుంచి 8గంటలు చాలని తెలిపారు. ఐఐటీలు, పెద్ద యూనివర్సిటీల్లో చదివిన వారే యూపీఎస్సీ పరీక్షల్లో విజయం సాధిస్తారనేది అపోహ మాత్రమేనని సాధారణ కళాశాలల్లో డిగ్రీ కోర్సులు, ఇంజనీరింగ్ కోర్సులు చదివినవారు కూడా సరైన ప్రిపరేషన్‌తో సివిల్‌లో విజయం సాధించవచ్చన్నారు. వరంగల్ నుంచి పలువురు సివిల్స్‌లో విజయం సాధించగా వారి వివరాలను కూడా ఉదహరించారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో సివిల్స్ ప్రిపరేషన్‌కు విస్తృతంగా సమాచారం ఉందని ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ కోచింగ్ తీసుకుంటే సివిల్‌లో విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ విత్ ఐఏఎస్, డిగ్రీ విత్ ఐఏఎస్‌గా కోచింగ్‌లు కూడా ఇస్తున్నారన్నారు. ఆర్క్ రిఫ్లెక్షన్ ఐఏఎస్ అకాడమి అడ్మినిస్ట్రేషన్ హెడ్ బి. అవినాష్, వివిధ సంస్థల గ్రూప్ డైరెక్టర్లు గిరిప్రకాశ్, గణేష్ మాట్లాడారు. ఈ సదస్సులో వివిధ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, పేరెంట్స్ పాల్గొన్నారు. వారు అడిగిన సందేహాలను డైరెక్టర్ వివేకానంద నివృత్తి చేశారు.

పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి



సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న తిరునహరి శేషు, దీక్షలో కూర్చున్న బీసీ నాయకులు

- బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు

హన్మకొండ : ఎలాంటి షరతులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధనకు, కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో తిరునహరి శేషు మాట్లాడుతూ..ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆంక్షలు పెట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ విద్యార్థులకు అన్యాయం చేస్తే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా మోసం చేస్తోందని దుయ్యబట్టారు. బీసీ నాయకులు నూతనకంటి ఆనందం, పాలడుగు సురేందర్ మాట్లాడుతూ పూలే విదేశీ విద్యా జ్యోతి పథకం ద్వారా విదేశాలకు వెళ్లే బీసీ విద్యార్థుల సంఖ్యను 300 నుంచి 800కి పెంచే ప్రతిపాదన ఫైల్ వెంటనే సంతకం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు డాక్టర్ ఎర్ర బొజ్జు రమేష్, చిన్నాల యశ్వంత్ యాదవ్, బండి డేనియల్, నేదునూరి రాజమౌళి, బుట్టి శ్యామ్ యాదవ్, దారా జనార్దన్, ఆకారపు మోహన్, కేడల ప్రసాద్, తాడిశెట్టి క్రాంతి, హైమావతి, బేబీ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ప్రభుత్వాన్ని దీవించండి

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

బయ్యారం : పేదల కష్టాలను తీర్చే ఇందిరమ్మ ప్రభుత్వాన్ని రాబోయే రోజుల్లో ప్రజలు దీవించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు. మండలంలోని కంబాలపల్లి, బయ్యారం, ఉప్పలపాడు, కొత్తపేట గ్రామ పంచాయతీల్లో శనివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. కంబాలపల్లి, బయ్యారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ శిలాఫలకాలను, గొల్లగూడెంలో బ్రిడ్జి నిర్మాణం, కొత్తపేటలో హాస్టల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కొత్తపేటలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడి ఏడాది పూర్తయిందని ఉగాది నుంచి పేదలకు సన్న బియ్యం అందజేస్తున్నామని పేర్కొన్నారు. పేదల 200యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు రూ.500కి గ్యాస్‌ను ఇస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తున్నామని రాబోయే రోజుల్లో అర్హులైన పేదలకు సొంతింటి కల సాకారం అయ్యేలా చూస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేస్తే వారికి వెంటనే డబ్బులు జమచేయడం జరుగుతుందని సూచించారు.



కంబాలపల్లిలో లబ్ధిదారురాలికి మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారంలో ఇందిరమ్మ లబ్ధిదారురాలికి నూతన వస్త్రాలు..

బయ్యారంలో ఇందిరమ్మ లబ్ధిదారురాలు బరిగెల ఉపేంద్ర ఇంటి నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి పొంగులేటి సదరు దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. మంత్రి వెంట ఎంపీ బలరాం నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, నీటిపారుదల సంస్థ చైర్మన్ విజయ్‌బాబు, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి, ఆర్డీఓ క్రిష్ణవేణి, డీఆర్డీఓ మధుసూదనరాజు, డీపీఓ హరిప్రసాద్, హౌజింగ్ పీడీ రాజయ్య, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి రైల్వే కోచ్ ఫ్యాక్టరీ..



రన్నింగ్ రూంను ప్రారంభిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్, రైల్వే అధికారులు

- రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్
- రైల్వే మోడల్ రన్నింగ్ రూం ప్రారంభం

కాజీపేట రూరల్ : కాజీపేట మండలం అయోధ్యపురం–మడికొండ శివారులో నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు. శనివారం ప్రత్యేక రైల్లో కాజీపేటకు చేరుకున్న జీఎంకు స్టేషన్ మేనేజర్ రవీందర్ పూలబొకేతో స్వాగతం పలికారు. అనంతరం కాజీపేట జంక్షన్‌లో రూ.7.50 కోట్ల వ్యయంతో నిర్మించిన రైల్వే లోకో పైలెట్లు, ట్రైయిన్ మేనేజర్ల విశ్రాంతి, రైల్వే రన్నింగ్ రూంను జీఎం పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం జీఎం అరుణ్‌కుమార్ జైన్ విలేకరులతో మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ డిసెంబర్ నాటికి పూర్తి కానుందని, అదేవిధంగా రైల్వే అమృత్ భారత్ పనులు కూడా చివరినాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రైల్వే రూట్ రిలే ఇంటర్ లాకింగ్ సిస్టం కార్యాలయంలో తనిఖీ చేశారు. కార్యక్రమంలో రైల్వే డీఆర్ఎం భర్తేష్ కుమార్ జైన్, పీసీఓఎం కె.పద్మజా, సీనియర్ డీఎం సురేష్ రెడ్డి, సీనియర్ డీసీఎం శిఫాలి, సీనియర్ డీఎస్టీఈ ప్రీతి అగర్వాల్, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్, ఇతర శాఖల అధికారులు, కాజీపేట డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ వెంకట కుమార్, ఎలక్ట్రిక్ షెడ్ సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి, కాదూరి సుబ్బారావు, జొన్నలగడ్డ శేషగిరి రావు, గోపాలం శ్రీనివాస్‌రావు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

వరంగల్‌లో కోచింగ్ లాబీకి నాయకుల వినతి

రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్ఎం భర్తేష్‌కుమార్ జైన్, పీసీఓఎంలను రైల్వే మజ్దూర్ యూనియన్ లోకో రన్నింగ్ బ్రాంచీ సెక్రటరీ పి.సాయికుమార్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి వరంగల్‌లో కోచింగ్ సిస్టం లాబీని ప్రారంభించాలని కోరారు. కాజీపేట జంక్షన్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని వినతి పత్రాలు సమర్పించారు. బ్రాంచీ చైర్మన్ సంగ రమేష్, ట్రెజరర్ డి.రఘు, అసిస్టెంట్ చైర్మన్ ఎ.కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్

కురవి : అన్నను హత్యచేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ సీరోలు పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18న సీరోలు మండల కేంద్రంలో అన్నను సొంత తమ్ముళ్లే హత్య చేయగా స్థానిక పోలీసులు కేసును చేధించినట్లు చెప్పారు. సీరోలుకు చెందిన వల్లపు లింగయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు వల్లపు కృష్ణ (మృతుడు) ఉన్నారు. మొదటి భార్య చనిపోయిన తర్వాత రెండో భార్యను పెళ్లి చేసుకోగా ఆమెకు ఇద్దరు కుమారులు జన్మించారు. అయితే తండ్రి లింగయ్యకు ఉన్న 16 ఎకరాల భూమిని కుమారులకు సమానంగా పంచి ఇచ్చినా రెండో భార్య కుమారులు తమకు తక్కువ భూమి వచ్చిందని తండ్రితో గొడవ పడుతున్నారు. ఈనెల 18న వల్లపు లింగయ్య, పెద్ద భార్య కొడుకు కృష్ణ, అల్లుడు ఎల్లావుల గోపాల్‌రావు పొలాన్ని దున్నుతుండగా వల్లపు నరేష్ వచ్చి పొలం దున్నవద్దని అడ్డుతగిలాడు. అనంతరం నరేష్ ఇంటికి వెళ్లి భార్య సౌందర్య, తల్లి నర్సమ్మలకు చెప్పి అన్నయ్య వల్లపు మహేష్, కాంపల్లి గ్రామానికి చెందిన నున్న వీరన్నను తీసుకుని వచ్చి వల్లపు కృష్ణ, తండ్రి లింగయ్యతో గొడవ పడి కత్తితో కృష్ణను పొడిచాడు. అడ్డుకోబోయిన లింగయ్యను సైతం కత్తితో గాయపరిచినట్లు పేర్కొన్నారు. కృష్ణను అడ్డు తొలగిస్తే ఆస్తి మొత్తం దక్కుతుందనే కుట్రతో వల్లపు నరేష్ కత్తితో పొడిచి చంపినట్లు డీఎస్పీ తెలిపారు. శని వారం హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమైన వల్లపు నరేష్, నర్సమ్మ, సౌందర్య, నున్న వీరన్నను సీరోలు శివారు సత్యమాత ఆలయం వద్ద ఎస్సై నగేష్ తన సిబ్బందితో పట్టుకోవడం జరిగిందని వివరించారు. ఈ నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. కేసులో ఉన్న వల్లపు మహేశ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసును చేధించిన మరిపెడ సీఐ రాజ్‌కుమార్, సీరోలు ఎస్సై నగేష్, సిబ్బందిని అభినందించాడు. హత్యకు ఉపయోగించిన కత్తి, సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ కృష్ణకిశోర్, మరిపెడ సీఐ రాజ్‌కుమార్, సీరోలు ఎస్సై నగేష్

కేయూ ఎన్‌జీఓ అధ్యక్షుడిగా నవీన్‌కుమార్



ఎన్‌జీఓ ఎంప్లాయీస్ అసోసియేషన్ బాధ్యులకు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న రాజేందర్



గెలుపొందిన క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బాధ్యులు

- క్లాస్‌ఫోర్త్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గుమ్మయ్య

కేయూ క్యాంపస్ : కేయూ ఎన్‌జీఓ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.నవీన్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎన్‌జీఓ ఎంప్లాయీస్ అసోసియేషన్, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఓటింగ్ శుక్రవారం జరుగగా ఓట్ల లెక్కింపు శనివారం యూనివర్సిటీలో నిర్వహించారు. అనంతరం ఫలితాలను రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్ ప్రకటించారు. ఎన్‌జీఓ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ యూనస్, జనరల్ సెక్రటరీగా వల్లాల తిరుపతి, జాయింట్ సెక్రటరీ (ఆర్గనైజింగ్)గా ఎ.సతీష్‌బాబు, జాయింట్ సెక్రటరీ(రిక్రియేషన్)గా టి.ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ (మహిళా)గా బి.కృష్ణవేణి, ట్రెజరర్‌గా టి.దామోదర్ విజయం సాధించారు. అలాగే.. క్లాస్‌ఫోర్త్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.గుమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా పి.అంకుష్, జనరల్ సెక్రటరీగా బొక్క మొగిలి, జాయింట్ సెక్రటరీగా ఆర్గనైజింగ్ మహ్మద్‌వలీ పాషా, జాయింట్ సెక్రట రీ(మహిళా)గా జి.మల్లికాంబ, జాయింట్ సెక్రటరీ (రిక్రియేషన్)గా ఎన్.ఐలయ్య, ట్రెజరర్‌గా టి.తిరుమల్ శ్రీనివాస్‌సింగ్ ఎన్నికయ్యారని రాజేందర్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పంజాల శ్రీధర్, సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.